క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



ప్రింటర్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్న ప్రభుత్వ పాఠశాలకు ఆ పాఠశాలలో 2000 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం రూ. 20 వేల విలువ గల ప్రింటర్‌ను బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్. శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఉన్నారు.

మల్సూర్‌కు ఎస్‌ఐగా పదోన్నతి

నడిగూడెం : నడిగూడెం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పని చేస్తున్న జి.చినమల్సూర్‌కు ప్రభుత్వం ఎస్‌ఐగా పదోన్నతి కల్పించింది. ఈ నెల 21 నుంచి జనవరి 13 వరకు శిక్షణ తీసుకోనున్నారు. బుధవారం స్థానిక ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది చిన మల్సూర్‌ను అభినందించారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

కోదాడరూరల్ : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయి, అనారోగ్యంతో బాధపడుతున్న అనంతగిరి మండలం కిష్టాపురానికి చెందిన హుస్సేన్, రమేష్‌లకు భారత్ వేల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్‌ఎస్‌రావు బుధవారం నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, మల్లీశ్వరి ఉన్నారు.

రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ప్రవీణ్



కోదాడరూరల్ : మీ సేవా ఆపరేటర్ల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా కోదాడ పట్టణానికి చెందిన కొదుమూరి ప్రవీణ్ ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీ సేవా ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.

ఉత్తమ్ యువసేన చేయూత

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన నిరుపేద పోలెబోయిన వెంకయ్య గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం స్థానిక ఉత్తమ్ యువసేన నాయకులు బాధితుడికి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఉత్తమ్ యువసేన నాయకులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం రాజు, పీఏసీఎస్ చైర్మన్ గోపాలరావు, నాయకులు సుబ్బారావు, రమేష్, ఎలమంద, గోవిందు, రాముడు, రవి, బాబు, శ్రీను, భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దు

నడిగూడెం : యువత మత్తు పదార్థాలకు అలవాటు పడవద్దని నడిగూడెం ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్ కోరారు. జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు బుధవారం నడిగూడెం మండలంలోని త్రిపురవరంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల నియంత్రణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్య, కానిస్టేబుల్ వీరబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేతన అలవెన్సులు పెంచాలి

హుజూర్‌నగర్ : పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా రైస్ మిల్ డ్రైవర్ల వేతన అలవెన్సులు పెంచాలని టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రోషపతి కోరారు. బుధవారం హుజూర్‌నగర్‌లో రైస్ మిల్ డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో యూనియన్ నాయకులు వీరబాబు, వెంకన్న, శ్రీహరి, రాంబాబు, నాగరాజు, రామారావు, నరసింహారావు, బాలకృష్ణ, వీరయ్య, శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు

సమాచార హక్కు రక్షణ చట్టం ఆవిర్భావ వేడుకలు



కేక్ తినిపిస్తున్న వంగవీటి శ్రీనివాసరావు

కోదాడరూరల్ : పట్టణంలోని సమాచార హక్కు రక్షణ చట్టం సంఘ కార్యాలయంలో ఆ చట్టం ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల ఇన్‌చార్జ్ వంగవీటి శ్రీనివాసరావు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ నవీన్ గోవింద, గోపి, డి.ముత్తయ్య, వికిల్, గోపి, అమీర్, వీరబాబు, నాగాచారి, నాగార్జున, రామారావు ఉన్నారు.

నిధులు మంజూరుపై హర్షం

నడిగూడెం : మండలంలోని చెన్నకేశ్వాపురం నుంచి నారాయణపురం మీదుగా సిరిపురం, వల్లాపురం గ్రామం వరకు బీటీ రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రెండు కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, ప్రజలు బుధవారం హర్షం వ్యక్తం చేశారు.

కొత్త టీచర్లు వచ్చేశారు

- విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

చిలుకూరు : చిలుకూరు మండలంలో నూతన ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరి పాఠాలు బోధించారు. చిలుకూరు ఎంఈఓ కార్యాలయంలో నూతన ఉపాధ్యాయులకు ఎంఈఓ గురవయ్య ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. కాగా, మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు ఒకరు, రామాపురం అంబేద్కర్ ప్రాథమిక పాఠశాలకు ఒకరు, ఆచార్యులగూడెం జిల్లా పరిషత్ పాఠశాలలో పీఈటీ, ఉపాధ్యాయుడు విధుల్లో చేరారు. ఎంఈఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగిరెడ్డి అంకిరెడ్డి, సురగాని లింగయ్య, స్థానిక ప్రధానోపాధ్యాయుడు జగన్‌మోహన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఉద్యోగం

చిలుకూరు గ్రామానికి చెందిన బాలేబోయిన నరేష్ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఉద్యోగం సాధించాడు. బుధవారం డీఈఓ చేతుల మీదుగా ప్రొసీడింగ్ కాపీ అందుకున్నాడు. చింతలపాలెం మండలంలో పోస్టింగ్ వచ్చినట్లు నరేష్ తెలిపారు.

అంకితభావంతో పని చేయాలి

హుజూర్‌నగర్ : ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలని మండల విద్యాధికారి భూక్య సైదానాయక్ అన్నారు. నలుగురు నూతన ఉపాధ్యాయులు బుధవారం హుజూర్‌నగర్‌లోని మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ చేతుల మీదుగా ప్రొసీడింగ్ కాపీలు అందుకుని పాఠశాలల్లో విధుల్లో చేరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, భాష, శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి, చిక్కుల గోవింద్, ప్రభాకర్‌రెడ్డి, సీఆర్‌పీ సైదులు తదితరులు పాల్గొన్నారు.



చిలుకూరులో పాఠాలు బోధిస్తున్న నూతన ఉపాధ్యాయురాలు ఉప్పల స్వాతి

ప్రొసీడింగ్ కాపీలు అందజేత

మునగాల : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు నూతన ఉపాధ్యాయులకు బుధవారం ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. మునగాల మండలానికి ఆరుగురు నూతన ఉపాధ్యాయులు వచ్చినట్లు తెలిపారు. కలకోవ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ పోస్టుకు ఒకరు, హైస్కూల్‌లోని పీఈటీ పోస్టుకు, ఆకుపాములలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్)కు, ఎల్‌పీహెచ్ పోస్టుకు, సీతానగరం తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ పోస్టుకు, నారాయణగూడెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు బయో సైన్సు పోస్టుకు ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లు తెలిపారు.

నేరేడుచర్ల : డీఎస్సీ పలితాల్లో ఉద్యోగాలు సాధించిన ముగ్గురు ఉపాధ్యాయులు బుధవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో మండల విద్యాధికారి సత్యనారాయణరెడ్డి నుంచి ప్రొసీడింగ్ కాపీలు అందుకొని విధుల్లో చేరారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలోని శాంతినగర్ ప్రాథమిక పాఠశాలకు రేఖ శిరీష, మండలంలోని బురుగులతండా ప్రాథమిక పాఠశాలకు శైలజ, సోమారంలోని ప్రాథమిక పాఠశాలకు నాయిని అనూషలకు పోస్టింగ్‌లు ఇచ్చినట్లు మండల విద్యాధికారి సత్యనారాయణరెడ్డి తెలిపారు.

నడిగూడెం : నడిగూడెం మండలంలో నూతనంగా ఎంపికై న ఉపాధ్యాయులు బుధవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ప్రొసీడింగ్ కాపీలు అందుకుని ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరారు. రామాపురం ప్రాథమిక పాఠశాలలో సాయిరాజ్, ఎకలాస్‌ఖాన్‌పేట ప్రాథమిక పాఠశాలలో ఉపేందర్, కరివిరాల ప్రాథమిక పాఠశాలలో నాగార్జున, నడిగూడెం పాత ప్రాథమిక పాఠశాలలో అమూల్య, బాలికల ఉన్నత పాఠశాలలో కల్పన విధుల్లో చేరినట్లు మండల విద్యాధికారి బాజా ఉపేందర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు గురుస్వామి, గోవర్ధన్, రామారావు, నాగరాజు, రాజశేఖర్, అంజన్ పాల్గొన్నారు.

మఠంపల్లి మండలానికి 24 మంది ఉపాధ్యాయులు

మఠంపల్లి : మండలానికి నియమింపబడిన 24 మంది నూతన ఉపాధ్యాయులకు బుధవారం స్థానిక ఎంఆర్‌సీలో ఎంఈఓ వెంకటాచారి ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడు తూ 16 మంది ప్రాథమిక పాఠశాలల్లో ఎస్‌జీటీలుగా, ఎనిమిది మంది ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్‌లుగా నియమితులైనట్లు తెలిపారు. అత్యధికంగా పెదవీడు జడ్పీహెచ్‌ఎస్‌కు ఐదుగురు స్కూల్ అసిస్టెంట్లు ఉద్యోగంలో చేరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు కిరీ టం, నేలపట్ల సత్యనారాయణగౌడ్, పెదవీడు జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం కీతా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కొండా వీరలక్ష్మి, పవన్, తదితరులు ఉన్నారు.

సొంత మండలంలోనే ఉద్యోగం



ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కొనసాగాలనే ఉద్దేశ్యంతో ప్రస్తుతం చేస్తున్న పోస్టల్ ఉద్యోగం వదులుకున్నాను. సొంత మండలంలో ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం ఆనందాన్ని ఇచ్చింది. మునగాల మండల కలకోవలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా విధుల్లో చేరాను. నాది నిరుపేద కుటుంబం. చిన్నతనంలోనే తండ్రి చనిపోవడంతో మా అమ్మ కూలీనాలీ చేసి నాతో పాటు నా తమ్ముడు, చెల్లెను పోషించింది. 2018లో డీఎస్సీ పరీక్షలు రాసినప్పటికీ ఉద్యోగం రాకపోవడంతో పోస్టల్ శాఖలో అసిస్టెంటు పోస్టుమాస్టర్‌గా ఉద్యోగం సాధించా. ఒక పక్క పోస్టల్‌శాఖలో విధులు నిర్వర్తిస్తూనే డీఎస్సీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యాను.

– మండవ దినేష్, ఎస్‌జీటీ, మునగాల

నా కల నెరవేరింది



ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడి విద్యార్థులను తీర్చిదిద్దాలనే నాకల నెరవేరింది. నేను రెండేళ్ల పాటు కోచింగ్ తీసుకొని డీఎస్సీ పరీక్షకు హాజరయ్యాను. నాభర్త, తల్లిదండ్రులు, అత్త, మామ ప్రోత్సాహంతోనే ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యాను. మాది నేరేడుచర్ల మండలం బక్కయ్యగూడెం. మునగాల మండలం ఆకుపాముల జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్)గా విధుల్లో చేరాను.

– కరణం వాసవి, స్కూల్ అసిస్టెంట్ జెడ్పీహెచ్ఎస్, ఆకుపాముల

ఆనందంగా ఉంది



టీచర్ జాబ్ రావడం చాలా సంతోషంగా ఉంది. మొదటి రోజు విద్యార్థులకు పాఠాలు బోధించడం మంచి అనుభూతినిచ్చింది. తోటి ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యేలా బోధించి ఉపాధ్యాయ వృత్తికి తగిన న్యాయం చేస్తా. నా భర్త, కుటుంబ సభ్యుల సహకారంతో ఉద్యోగం సాధించా.

– ఉప్పల స్వాతి, ఎస్‌జీటీ, ప్రాథమిక పాఠశాల, రామాపురం, చిలుకూరు మండలం

చిన్ననాటి నుంచే టీచర్ కావాలనేది నా లక్ష్యం



చిన్ననాటి నుంచి టీచర్ కావాలని లక్ష్యం పెట్టుకున్నాను. కష్టపడి చదివి ఉ ద్యోగం సాధించాను. జా బ్ రావడం, సొంత మండలంలో పోస్టింగ్ రావడం సంతోషంగా ఉంది. పాఠాలు మంచిగా చెప్పి విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులు వేస్తాను. నా కుటుంబ సభ్యుల సహకారంతోనే ఉద్యోగం సాధించాను.

– గుండు రామారావు, ఎస్‌జీటీ, ప్రాథమిక పాఠశాల, చిలుకూరు

దళితులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



బేతవోలులో బాధిత దళితులతో మాట్లాడుతున్న దళిత సంఘం నాయకులు

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో దసరా పండుగ రోజు దళితులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని దళిత సంఘాల రాష్ట్ర నాయకులు సైకిలాబ్, కోట రమేష్‌లు అన్నారు. బుధవారం బేతవోలులో బాధిత దళిత కుటుంబాలను వారు పరామర్శించి మాట్లాడారు. దళితులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పండుగ రోజు దళిత యువకుడు వీడియో కాల్ మాట్లాడుతుంటే అపార్థం చేసుకొని దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. పోలీసులు ఎలాంటి విచారణ జరపకుండా రాత్రికి రాత్రే దళితులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపడం సరైనది కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు కోట గోపి, మర్రి నాగేశ్వరరావు, బొడ్డుపల్లి సురేష్, శ్రీనివాస్, దళిత సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పురస్కార కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

గరిడేపల్లి : అరుణోదయ నాగన్నకు జాతీయ పురస్కారం రావడం హర్షణీయమని డప్పు కళాకారుడు అమరవరపు సతీష్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధులు సుద్దాల హన్మంతు, జానకమ్మ దంపతుల జ్ఞాపకార్థం ప్రతి ఏటా ఇస్తున్న జాతీయ పురస్కారాన్ని తెలంగాణ సాంస్కృతిక సారథి, కళాకారుడు, గాయకుడు అరుణోదయ నాగన్నకు ఇవ్వనున్నారు. బుధవారం గరిడేపల్లి మండల కేంద్రంలో పురస్కారంనకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 19వ తేదీన సుద్దాల ఫౌండేషన్ తరఫున అరుణోదయ నాగన్న జాతీయ పురస్కారం అందుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా భిక్షపతి, బీఆర్‌ఎస్ నాయకులు రాపోలు నవీన్, జీలకర్ర రామస్వామి, కర్రి సతీష్‌రెడ్డి, వీరబాబు, సైదులు, భాస్కర్, సారంగపాణి, సైదా, పిట్ట శ్రీను, ముస్తాఫా, సైదులు తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలి

హుజూర్‌నగర్ : ఎస్సీ, ఎస్టీల కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్‌ను ప్రభుత్వం అమలు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సైకిలాబ్ బాబు కోరారు. బుధవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన కేవీపీఎస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం దళితులకు ప్రకటించిన దళిత బంధు పథకం తన రాజకీయ అనుయాయులకు మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దళిత బంధుకు నిధులు పెంచి ప్రతి కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామని ప్రకటించి నేటికీ అమలు చేయకపోవడం సరైనది కాదని పేర్కొన్నారు. కుల గణన చేపట్టిన తర్వాతనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ఆయన కోరారు. కుల గణనతో పాటు కుల, మతాంతర వివాహితుల సంఖ్యను కూడా గణించాలని కోరారు. సమావేశంలో కేవీపీఎస్ నాయకులు గోపి, నాగేశ్వరరావు, సైదులు, యోనా, సురేష్, వెంకటేశ్వర్లు, దుర్గయ్య, హుస్సేన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తహసీల్దార్, కంప్యూటర్ ఆపరేటర్ కస్టడీ

హుజూర్‌నగర్: ప్రభుత్వ భూములను అక్రమంగా బదిలీ చేసి రైతుబంధు నిధులు స్వాహా చేసిన గతంలో హుజూర్‌నగర్ తహసీల్దార్‌గా పనిచేసిన జయశ్రీ, కంప్యూటర్ ఆపరేటర్ జగదీష్ పోలీస్ కస్టడీ బుధవారం కూడా కొనసాగింది. రెండో రోజు సీఐ కార్యాలయంలో పోలీసులు వారిద్దరిని కలిపి విచారించినట్లు తెలిసింది. జయశ్రీ ప్రస్తుతం నల్లగొండ జిల్లా అనుముల మండల తహసీల్దార్ పనిచేస్తుండగా.. గతంలో ఆమె పనిచేసిన మండలాల్లో ఏమైనా ప్రభుత్వ భూములను ఇతరుల పేరుతో బదలాయించారా, ఇందులో అధికారులు, నాయకుల ప్రమేయం ఉందా అనే కోణంలో పోలీసులు విచారించినట్లు తెలిసింది. రైతు బంధు ద్వారా పొందిన సొమ్ముకు సంబంధించిన వివరాలు రాబట్టినట్లు సమాచారం. గురువారం సాయంత్రం వరకు పోలీస్ కస్టడీ కొనసాగనుంది.

పరిహారం విడుదల హర్షణీయం

పాలకవీడు : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పంట నష్టపోయిన రైతులకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో ప్రభుత్వం నుంచి పరిహారం విడుదల కావడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాఘవపురం, మిగడంపహాడ్‌తండా గ్రామాల్లో వరదలకు 201.34 ఎకరాల్లో నష్టపోయిన 264 మంది రైతులకు ఎకరాకు రూ.10వేల చొప్పున ప్రభుత్వం పరిహారం ప్రకటించిందన్నారు. నాయకులు మాళోతు మోతీలాల్, యాతం శ్రీను, నాగేశ్వరరావు, హనుమంతరావు, వెంకటేశ్వర్లు, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు రూ.25 కోట్లు మంజూరు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని గ్రామీణ, అంతర్గత రహదారులకు రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి రూ.25 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో 23.90 కిలోమీటర్ల మేర అంతర్గత రహదారులు నిర్మించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి జీఓ విడుదలైంది. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కోదాడరూరల్ : కోదాడలో ఈ నెల 21, హైదరాబాద్‌లో 24న జరగబోయే పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేద్దామని ఆ సంఘం జిల్లా కార్యదర్శి చందర్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఉత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గత 50 ఏళ్లుగా పీడీఎస్‌యూ విద్యార్థుల పక్షాన ఉంటూ వారి సమస్యలపై నిరంతరం ఉద్యమాలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పులి రాఖీ, వేణు, గౌతమ్, సంధ్య, స్వప్న, మౌనిక, జ్యోతి, రాణి, రాధిక తదితరులు ఉన్నారు.

రహదారికి మరమ్మతులు



రత్నవరం వద్ద కల్వర్టుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

నడిగూడెం : మండల వ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారులు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. దీంతో సాక్షిలో పలుమార్లు ప్రమాదకరంగా రహదారులు అనే శీర్షికతో ప్రచురితమైన కథనాలకు సంబంధిత అధికారులు స్పందించారు. బుధవారం రత్నవరం కల్వర్టుపై మట్టి పోసి మరమ్మతులు చేపట్టారు. అలాగే నడిగూడెం నుంచి చాకిరాలకు వెళ్లే దారిలో దెబ్బతిన్న రోడ్డు వెంట మట్టి పోశారు.

మట్టపల్లిలో వైభవంగా నారసింహుని నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను పట్టు వస్త్రాలతో అందంగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తికట్టించారు. అనంతరం కల్యాణతంతు నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు ధర అందిస్తున్నాం

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



మోతెలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి



కోదాడరూరల్ : ఎన్‌ఆర్‌ఐ రావిళ్ల సాయిశ్రీని అభినందిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

మోతె : రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర అందిస్తుందని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. సన్నాలకు బోనస్‌గా రూ.500లు చెల్లిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఏపీఎం వెంకయ్య మాట్లాడుతూ.. ఏ గ్రేడ్ దొడ్డు రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,320, బి.గ్రేడ్‌కు రూ.2,300, సన్నాలు ఏ గ్రేడ్ క్వింటాకు రూ.2,320, బి గ్రేడ్‌కు రూ.2300లు ఇస్తున్నట్లు తెలిపారు. మండలంలో 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అవుతాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంఘమిత్ర, ఏఓ అరుణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్ రెడ్డి, పార్టీ నాయకులు మాత్యనాయక్, సామ చిన వెంకటరెడ్డి, మామిడి వెంకటేశ్వర్లు, పులి ఈదయ్య, చిరంజీవి, రైతులు సామ రాంరెడ్డి, లింగారెడ్డి, సాలయ్య, నర్సయ్య, సీసీ రామకృష్ణ, సంఘ బంధం అధ్యక్షురాలు దోసపాటి రమణ, వీఓఏ మంగమ్మ, భవాని, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐలు సామాజిక సేవ చేయాలి

కోదాడరూరల్ : ఎన్‌ఆర్‌ఐలు పుట్టిన గడ్డపై పేద ప్రజల కోసం సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి అన్నారు. కోదాడ పట్టణానికి చెందిన రావిళ్ల కృష్ణారావు కుమార్తె ఎన్‌ఆర్‌ఐ సాయిశ్రీ బుధవారం కోదాడకు వచ్చిన సందర్భంగా ఆమెను ఎమ్మెల్యే అభినందించారు. సాయిశ్రీ మాట్లాడుతూ.. భారతదేశ, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను అమెరికాలో కూడా విస్తరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్నేని వెంకటరత్నం బాబు, సుంకరి నాగయ్య, వేమూరి విద్యాసాగర్, లైటింగ్ ప్రసాద్ ఉన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

మోతె : మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఎల్మారెడ్డి విజయపాల్‌రెడ్డి దశదిన కర్మ బుధవారం రాఘవాపురంలో జరిగింది. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి పాల్గొని విజయపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నామవరంనకు చెందిన గగ్గినపల్లి జగత్‌రెడ్డి దశదిన కర్మలో పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, నాయకులు ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దారి బాగు చేయించి.. నీరు నిల్వకుండా చేసి



జేసీబీతో దారి పనులు చేయిస్తున్న కిషోర్‌రెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

మఠంపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వచ్చిపోయే దారి బురదమయమై విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతుండడంతో స్థానిక కాంగ్రెస్ నాయకుడు ఆదూరి కిషోర్‌రెడ్డి తన సొంత ఖర్చు రూ.10వేలతో బుధవారం జేసీబీతో నీరు నిల్వకుండా చదును చేయించారు. పాఠశాల గ్రౌండ్‌లో నీరు నిల్వకుండా వెళ్లేందుకు సిమెంట్ గూనలు ఏర్పాటు చేయించి, నడక దారిలో మట్టి పోయించారు. ఈ సందర్భంగా కిషోర్‌రెడ్డికి హెచ్‌ఎం షేక్ మౌలానా విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రామకృష్ణ, సూర్యనారాయణ మూర్తి, కోటిరెడ్డి, విజయ, పీఈటీ వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

పూర్తిగా అదుపులోకి రాని డయేరియా



డయేరియా వ్యాధి బారిన పడిన వారి వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నిరంజన్

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : మండల కేంద్రమైన చింతలపాలెంలో డయేరియా వ్యాధి పూర్తిగా అదుపులోకి రాలేదు. బుధవారం గ్రామంలో ఆరు డయేరియా వ్యాధి బారిన పడిన వారిని గుర్తించారు. అందులో ముగ్గురు చికిత్స నిమిత్తం కోదాడ వెళ్లగా మిగతా వారు గ్రామంలోనే చికిత్స పొందుతున్నారు. గత వారం పది రోజుల క్రితం గ్రామంలో డయేరియా కేసులు నమోదు అయ్యాయి. దీంతో గ్రామంలోని ముత్యాలమ్మ గుడి బజార్‌లో డయేరియా నివారణ క్యాంపు ఏర్పాటు చేశారు. అయినా వ్యాధి అదుపులోకి రాలేదు. పరిస్థితిని తెలుసుకునేందుకు బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నిరంజన్ గ్రామంలో పర్యటించి పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెప్పారు. కలుషితం కాని ఆహారం, మంచినీరు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సీతామాలక్ష్మి, డాక్టర్ సచిన్, సీహెచ్‌ఓ వినోద్‌కుమార్, సూపర్‌వైజర్లు, ఆశాలు ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి



క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న పీసీసీ సభ్యుడు లక్ష్మీనారాయణరెడ్డి

కోదాడరూరల్ : క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని టీపీసీసీ సభ్యుడు సీహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే.నయీంలు అన్నారు. బుధవారం పట్టణంలో మహేంద్ర యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బాక్స్ క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు తమకు ఇష్టమైన క్రీడాల్లో రాణించి కోదాడకు పేరు ప్రఖ్యాతలు తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహేంద్ర యూత్ అధ్యక్షుడు లాజర్, పంది తిరపయ్య, కర్ల సుందర్‌బాబు, నాగరాజు, మస్తాన్, అలీమ్, అబ్బు ఉన్నారు.

పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కోదాడరూరల్ : గేదెకు టీకా వేస్తున్న డాక్టర్ పెంటయ్య

కోదాడరూరల్ : పశువులకు వచ్చే వ్యాధుల పట్ల పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని కోదాడ ప్రాంతీయ పశువైద్యశాల డాక్టర్ పి.పెంటయ్య సూచించారు. జాతీయ పశువైద్య వ్యాధుల నివారణలో భాగంగా బుధవారం స్థానిక పశువైద్యశాలలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గాలికుంటు వ్యాధి వేగంగా ఒక పశువు నుంచి మరొక పశువుకు సోకుతూ పాల దిగుబడిని తగ్గించడమే కాక పశువుల్లో అబార్షన్‌కు కారణమై పాడిరైతులను నష్ట పరుస్తుందని తెలిపారు. వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రశాంత్, చంద్రకళ, రైతులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి

నడిగూడెం : సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్.బి.అఖిల కోరారు. బుధవారం మండల కేంద్రంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. డాక్టర్.మాడుపల్లి రవికుమార్, పశు వైద్యసిబ్బంది ఎస్.కరుణాకర్‌రెడ్డి, కె.రాహుల్, వెంకటరమణ, శ్రీను, గోపాలమిత్రలు, పాడి రైతులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

గరిడేపల్లి : పాడి రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి రవినాయక్ అన్నారు. బుధవారం గరిడేపల్లి మండల కేంద్రంలో గాలికుంటు వ్యాధి టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. 10 ఆవులు, 161 గేదెలకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రజిత, మధు, అజాహర్, గోపి, గోపాలమిత్రలు వీరారెడ్డి, వెంకటేశ్వర్లు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో..

నేరేడుచర్ల : గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు వేయించాలని మండల ఇన్‌చార్జ్ పశు వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ అన్నారు. బుధవారం నేరేడుచర్లలోని రామాపురం, నర్సయ్యగూడెంలో పశువులకు గాలి కుంటు నివారణ వ్యాధి టీకాలు వేశారు. పశువైద్య సిబ్బంది సబెరా, ఇస్మాయిల్, విజయ్, సంపత్, స్వప్న, భాస్కర్, గోపాలమిత్రలు సైదులు, భుజంగరావు, సాయి, కృష్ణ తదితరులు ఉన్నారు.

వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కోదాడరూరల్ : హైదరాబాద్‌లోని సుందరయ్య కళాభవన్‌లో ఈ నెల 18న నిర్వహించబోయే కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర 67వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం కోదాడ పట్టణంలో వార్షికోత్సవ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సమావేశంలో కల్లు గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా గీత కార్మికులను సమీకరించి వృత్తిలో ఉపాధి, ఆధునీకికరణ అవకాశాలపై చర్చిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలి అంజయ్య, గుణగంటి కృష్ణ, జెర్రిపోతుల కృష్ణ, నోముల వెంకన్న, అబ్బగాని కాశయ్య, ఆకుల రమేష్ తదితరులు ఉన్నారు.